ఘనంగా మహాశివుడి పడిపూజ


పూజల్లో స్వాములు, భక్తులు

మణికొండ: మహాశివుడి మహా పడిపూజతో సంటకహర హనుమాన్ ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆదివారం మైహోం అవతార్ సమీపంలోని ఆలయంలో శివస్వాములు గురుస్వాములు విఠల్, సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా పడిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భజన భక్తి పాటలతో భక్తులందరినీ ఉత్రూతలూగించింది. పెద్ద ఎత్తున భక్తులు మహా పడిపూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రంగనాథుడికి ప్రత్యేక అభిషేకం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారంస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, పూజలు, అలంకారం చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామపారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ప్రత్యేక పల్లకిసేవా, వాహనసేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు రథోత్సవం...

రంగనాథుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవం సోమవారం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయ రథాన్ని అందంగా తీర్చిదిద్దారు. సోమవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించడం హర్షణీయం

జియాగూడ: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించడం హర్షణీయమని జియాగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సహా కార్యదర్శి, హైదరాబాద్ టీం సంపత్ అన్న సైన్యం మహేష్ బాబు అన్నారు. ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్ఏ.సంపత్ కుమార్‌ను కలిసి సన్మానించారు. అనంతరం మహేష్‌బాబు మాట్లాడుతూ..40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు అన్ని కులాల వారికి ప్రాధాన్యం కల్పించడంతో తమ దీర్ఘకాల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు కంటి, ఈఎన్‌టీ పరీక్షలు

గోల్కొండ: 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా కంటి, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహిస్తున్నామని టోలిచౌకీలోని ఈస్పైర్ ఐఅండ్ఈఎన్‌టీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎం.భాషా తెలిపారు. కంటి పరీక్షలు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు..ఈఎన్‌టీ పరీక్షలు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. టోలిచౌకీ గెలాక్సీ సెంటర్ బర్గర్ కింగ్ రెస్టారెంట్ ఎగువన ఉన్న ఆసుపత్రిలో ఈ ఉచిత వైద్య పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. పరీక్షల కోసం సీనియర్ సిటిజన్స్ 90001 41617, 040-451 23999లో సంప్రదించాలన్నారు.

అంధకారంలో కోకర్ వాడి

చార్మినార్: ఘాన్సీ బజార్ డివిజన్‌లోని కోకర్ వాడిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం సంబంధిత జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో అంతటా అంధకారం నెలకొన్నదన్నారు. విద్యుత్ బల్బులు కాలిపోయాయా..? లేదా..? టైమర్ పని చేస్తుందా... లేదా అనే విషయాలను సంబంధిత అధికారులు తెలుసుకొని వెంటనే వీధి దీపాలు ప్రతిరోజూ నిరంతరాయంగా వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కిషన్‌బాగ్ ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..అల్లా మజీద్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..అసద్ బాబానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఔట్ సోర్సింగ్ కింగ్

- శంషాబాద్ మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధిపత్యం
- 'కీలక విభాగాల్లో వారే..
- మొక్కుబడిగా ప్రభుత్వ ఉద్యోగులు



శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధిపత్యానికి అదుపు లేకుండా పోతోంది. వీరి కారణంగా మున్సిపాలిటీకి చెడ్డపేరొచ్చినా ఉన్నతాధికారులకు పట్టడం లేదు. ఏళ్ల తరబడి తిష్ట వేస్తున్న వారిపై ప్రక్షాళనకు అడుగులు వేసిన దాఖలాలు లేవు. వీరి పెత్తనం ఎవరి ప్రయోజనం కోసం అన్నది ఇప్పుడు మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది. వీరి ముందు సర్కారు ఉద్యోగులు కీలు బొమ్మలుగా మారుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హోర్డింగ్‌లపై దందా..

పంచాయతీ కాలం నుంచి మున్సిపాలిటీగా మారి ఆరేళ్లు గడుస్తున్నా ఓ ఉద్యోగి కీలకమైన వినోద పన్ను రాబట్టే హోర్డింగ్ విభాగంలోనే విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో అధికారికంగా 140 హోర్డింగులుంటే అందులో సుమారు నలభై వరకు అనుమతులు లేకుండానే ఉంటాయి. వీటి లెక్కలన్ని సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పర్యవేక్షణలోనే ఉన్నాయి. అధికారులు మారుతున్నా ఆయన తప్ప మరొకరు లేన్నట్లుగా ఈ లెక్కలన్ని అతడికే అంకితం చేయడం వెనక ఏమైనా మతలబు ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల హైడ్రా అధికారులు అక్రమ హోర్డింగులను గుర్తించి వెల్లడించే దాకా మున్సిపాలిటీ అధికారులు ఇక్కడున్న అక్రమ హోర్డింగులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం.

అక్రమ నిర్మాణాలు..

మున్సిపాలిటీలోని కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులున్నా వీరి విధులు కూడా నామ మాత్రంగానే ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఇక్కడ కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిదే కీలక పాత్ర ఉండడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు శానిటేషన్, రెవెన్యూ, ఇంజినీరింగ్ ఇలా అన్ని విభాగాల్లో వీరు ఆడిందే ఆటపాడిందే పాటగా మారుతోందనే ఆరోపణలున్నాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తీరుపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, పటణాభివృద్ధి శాఖ అధికారులకు సైతం ఫిర్యాదులు అందాయి. ఇటీవల గ్రూప్ ఫలితాల అనంతరం ఉద్యోగ నియామకాలు పొందిన ఏడుగురు ఉద్యోగులు మున్సిపాలిటీ కార్యాలయంలో రిపోర్టు చేశారు. వీరితో పాటు ఇప్పటికే వీఆర్ఏ, వీఆర్వోల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులు కూడా మున్సిపాలిటీ ఉన్నారు. అయినా వీరెవరికి కూడా ఇంత వరకు కచ్చితమైన బాధ్యతలు అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వివిధ విభాగాల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల స్థానంలో వీరికి పూర్తి బాధ్యతలు అప్పగించాలని పట్టణ ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే మార్పులు ఉంటాయి..

ఇటీవలే ప్రభుత్వం నుంచి మరో ఏడుగురు ఉద్యోగులు నియామకమయ్యారు.వారితో పాటు ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరిని ఆయా విభాగాల్లో విధులు అప్పగిస్తాం. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం కావడంతో మరో నెల తర్వాత కచ్చితంగా మార్పులు చేర్పులు చేస్తాం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పనితీరునూ పర్యవేక్షిస్తాం.

– బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

వాసవి అమ్మవారి దేవాలయం నిర్మించాలి


సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో అనువైన స్థలాన్ని ఎంచుకుని వాసవి అమ్మవారి దేవాలయం నిర్మించాలని ఆర్యవైశ్య సంఘాలు నిర్ణయించారు. ఆదివారం ఆవోపా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షతన ఎర్రం శ్రీనివాస్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో శ్రీధర్ మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని రాజకీయ నాయకుల సహకారంతో అమ్మవారి దేవాలయ నిర్మాణం చేపట్టాలని అందుకు అనువైన స్థలాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. ఇందుకు ఆర్యవైశ్య సంఘాలన్నీ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీహరి, బద్రీనాథ్, రత్నం, నాగరాజు, ప్రవీణ్, సాయిరాం, సురేష్, కృష్ణ, రక్షిత, లాస్యం, సమంత, ప్రవంతి, వేణు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిని ఆహ్వానిస్తున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుతాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈశ్వర్, వై.వెంకటేష్, రాముయాదవ్, రఘు యాదవ్, వెంకటేష్ కురుమ, సోమ శ్రీనివాస్, అరుణ్‌ముదిరాజ్, డి.రమేష్, జి.రాజు, మంచర్ల చిరంజీవి, సురేష్‌ముదిరాజ్, గంజి రాజు, భాస్కర్ నేత, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి


పద్మశాలి మహాసభల ఆహ్వాన పత్రం ఆవిష్కరిస్తున్న అంబటి శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: పద్మశాలి మహాసభలను విజయవంతం చేసేందుకు పద్మశాలి సోదరులంతా కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. మార్చి 9న జరిగే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్వాన్ మార్కండేయ భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ..మార్చి 9న కార్వాన్ నుంచి తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. పద్మశాలి సోదరుల హక్కుల సాధన, హక్కుల పరిరక్షణ కోసం మనమంతా కలిసికట్టుగా వేదికపై ప్రభుత్వ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కార్వాన్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి రఘునాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట సాయికుమార్, నవీన్‌కుమార్, డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కట్ల అశోక్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉత్తరపల్లి కృష్ణ, సి.గోపాల్, పల్లె పాండు, అంబటి సంతోష్, శ్రీనివాస్ రాపోలు సందీప్‌చౌదరి, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం


చెస్ పోటీలలో విజేతలతో నిర్వాహకులు

చార్మినార్: డాక్టర్ మన్‌మోహన్ సింగ్ మెమోరియల్ స్కూల్ చెస్ టోర్న మెంట్-2025 పోటీల్లో గోల్కొండలోని కేంద్రీయ విద్యాలయ స్కూల్ విద్యార్థి మంగోలపల్లి విద్యాధర్ మొదటి బహుమతి పొందారు. రెండో బహుమతి నాచారంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి మహ్మద్ షబ్బీర్ అహ్మద్‌కు లభించగా..మూడో బహుమతి మహేంద్రహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి విజయేందర్‌కు లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ఈ పోటీలు తొమ్మిది రౌండ్లలో స్విస్ ఫార్మేట్‌లో జరిగాయి. విజేతలకు సుల్తాన్-ఉల్-ఉలూం ప్రిన్సిపాల్‌తో పాటు సొసైటీ చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హైఖాద్రీ, డైరెక్టర్ సిరాజుద్దీన్ తదితరులు బహుమతులు అందజేశారు. అండర్-16 పేరుతో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు మెమెంటోలతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు.

నేడు రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో 'ప్రజావాణి'


రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

ఔటర్‌పై కార్లతో విన్యాసాలు

డ్రైవర్ల కోసం పోలీసుల గాలింపు

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై అర్ధ రాత్రి కార్లతో విన్యాసాలు చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ 16, పెద్ద గోల్కొండ ఔటర్ ఎగ్జిట్ 15 మధ్యలో ఔటర్‌పై శనివారం అర్ధరాత్రి రెండు కార్లతో గుర్తు తెలియని వ్యక్తులు విన్యాసాలు చేస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బందికి సమాచారం రాకవడంతో అక్కడకు చేరుకునేలోపు కార్లతో పారిపోయారు. కార్లతో విన్యాసాలు చేసిన వారి గురించి పోలీసులు గాలిస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



రాజేంద్రనగర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఓఆర్ఆర్ సమీపంలోని గాంధీనగర్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతిచెంది ఉందని 100 నంబర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు 40-45 సంవత్సరాలు ఉంటుందని..స్థానికంగా భిక్షాటన చేస్తూ రోడ్డు పక్కన ఉండేదని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్‌లో సత్తాచాటుతున్న కార్తీక్

గోల్కొండ: షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వై.సి.ఎస్.కార్తీక్ క్రికెట్‌లో సత్తాచాటుతున్నారు. ఇటు బౌలింగ్, అటూ బ్యాటింగ్‌లో కూడా సత్తాచాటుతూ స్కూల్ టోర్నమెంట్‌లు అండర్-14 జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఫారూక్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కార్తీక్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని కోచ్ ఫారూఖ్ ఫరాక్ అంటున్నారు. ప్రతి నిత్యం ప్రాక్టిస్ చేస్తు కఠోర సాధనతో ముందుకు సాగుతున్న కార్తీక్ పాల్గొన్న ప్రతి టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభకనబరిచి పలుమార్లు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్ అవార్డులు కూడా పొందారు. పాఠశాల వారు సైతం కార్తీక్‌ను ప్రోత్సహిస్తున్నారు.

ఓర్పు, నేర్పుతో సాధన చేస్తే విజయం తథ్యం


అన్నమాచార్య విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న శోభారాజు

బండ్లగూడ: ఓర్పు, నేర్పుతో సాధన చేస్తే విజయం వరిస్తుందని పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని కుందన మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం తాళ్లపాక అన్నమాచార్య పంచలోగ విగ్రహ ప్రతిష్ఠాపనలో శోభారాజు పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంగీతం నేర్చుకోవడంతో భక్తిభావం పెరుగుతుందన్నారు. కుందన మ్యూజిక్ అకాడమీ దినదిన ప్రవర్ధమానం కావాలని, పిల్లలకు మరెన్నో కీర్తనలు నేర్పించి మంచి కళాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. కుందన మ్యూజిక్ అకాడమీ అధినేత సాలూరి సతీష్ పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అనుమతితో పలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంకటేష్, ఏసీపీ సత్యనారాయణ, సీఐ సురేష్ పలువురు సంగీత ప్రియులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు.

చిత్రపురి సమస్యలు పరిష్కరించాలి


స్థానికులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధి చిత్రపురికాలనీలో రోడ్లు, వీధి దీపాలు, నీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సీతారాం, నరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం చిత్రపురిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. చిత్రపురిలో పలు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా హౌసింగ్ సొసైటీ, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నిధులతో నిర్మించనున్న పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. బస్తీ దవాఖానాలో సరైన సిబ్బంది లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రినాయుడు, విఠల్, రమణమూర్తి, కిరణ్, బాలాజీ, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, రామసుబ్బారెడ్డి, సందీప్, సుమ నళిని, శ్రీధర్, తిరుపతి పాల్గొన్నారు.

కాటేదాన్‌లో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌లోని ఓ గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ ప్రాంతంలో దారుసల్లామ్ ప్రాంతానికి చెందిన రింకు కుమార్ జైన్(45) బ్యూటీ కాస్మొటిక్ గోడౌన్‌లో సెల్యూన్స్‌కు సంబంధించిన కుర్చీలు తయారు చేసే గోదాం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఒక్కసారిగా గోదాంలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన సిబ్బంది, స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, నాయకులు, భక్తులు



గచ్చిబౌలి: కొండాపూర్ పరిధి కొత్తగూడలో వెలిసిన అలిమేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏటా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను ఆశీర్వదించగా, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊట్ల కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, ఊట్ల దశరథ్, మణిరత్నం, లక్ష్మణ్, శ్రీనివాస్, సంతోష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రంగనాథుడి సేవలో పద్మభూషణ్ స్వప్నసుందరి


స్వప్న సుందరి నృత్య ప్రదర్శన

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో ఆదివారం ప్రముఖ నృత్యకారిణి, పద్మభూషణ్ స్వప్నసుందరి పాల్గొన్నారు. ఎన్నో రంగనాథుడి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న ఆమె ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం స్వామివారి వాహనసేవలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె స్వామివారిని, మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

గోల్కొండ: పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి. గోల్కొండ కోటలో వేలాదిగా పర్యాటకులు సందడి చేశారు. కోటలోని ఆయుధాగారంలోని కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి ఆయుధాలను చూస్తూ వాటిని తమ సెల్‌ఫోన్స్‌ల్లో బంధించుకున్నారు. మరో వైపు కుతుబ్‌షాహీ రాజుల సమాధుల ప్రాంగణమైన సెవన్ టూంబ్స్‌లో సైతం పర్యాటకులు సందడి చేశారు. ఈ ప్రాంతంలోని ఆధునీకరించబడిన కుతుబ్‌షాహీ రాజుల సమాధుల అందాలను తిలకించారు. రాజుల శవాలను స్నానం చేయించే గదులను సైతం ఎంతో ఆశ్చర్యంగా తిలకించారు.

